క్లుప్తంగా

ప్రైవేట్‌కు దీటుగా బోధన

సూర్యాపేటటౌన్ : ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన చేస్తున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు గోలి పద్మ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో విద్యా సంవత్సరం చివరి రోజు సందర్భంగా విద్యార్థులకు ఆన్‌లైన్ ప్రొగ్రెస్ కార్డులు పంపిణీ చేసి మాట్లాడారు. తమ పాఠశాలలోని విద్యార్థులు ప్రతి తరగతిలో అధిక శాతం మార్కులు సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

లింగయ్య మృతి తీరని లోటు



లింగయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కల్లుగీత కార్మిక సంఘం నాయకులు

పెన్‌పహాడ్ : కల్లుగీత కార్మిక సంఘం సీనియర్ నాయకుడు ఐతబోయిన లింగయ్యగౌడ్ మృతి తీరని లోటని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మడ్డి అంజిబాబుగౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నాగులపాటి అన్నారం గ్రామంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బోడ సైదులు, పరశురాములు, ధనియాకుల శ్రీకాంత్‌వర్మ, ఐతబోయిన వెంకన్న, సత్యం, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి వేడుకలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంతోపాటు మండల వ్యాప్తంగా హనుమాన్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జాజిరెడ్డిగూడెంలోని భక్త బాలాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ మాల ధారులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాలధారులు చెనబోయిన వీరయ్య, సూరు సైదులు, నిమ్మల రాజు, నిమ్మల నవీన్, నిమ్మల సోమన్న, భక్తులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల పరామర్శ

అర్వపల్లి : తిమ్మాపురం గ్రామానికి చెందిన హైదరాబాద్ టీఎస్ ఆర్టీసీ యూనియన్ నాయకుడు కందుల వెంకటరావు తల్లి కందుల రాంబాయమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. మృతురాలి కుటుంబీకులను మంగళవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్ పరామర్శించారు. అలాగే గ్రామానికి చెందిన బూర్గుల భిక్షం అనారోగ్యంతో మృతి చెందగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు కందుల దశరథ రామారావు, పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ చల్లా వేణుధర్‌రెడ్డి, కందుకూరి మధుసూదన్, నాగేందర్, రాంబాబు పాల్గొన్నారు.

రైస్ మిల్లు తనిఖీ



రైస్ మిల్లును తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

నూతనకల్ : ప్రభుత్వ నిబంధనల మేరకు మిల్లర్లు సీఎంఆర్ సరఫరా చేయాలని ఎంపీడీఓ సునీత అన్నారు. మంగళవారం బిక్కుమళ్ల గ్రామ శివారులోని మమత బిన్ని రైస్ మిల్లును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వం మిల్లుకు కేటాయించిన ధాన్యానికి సంబంధించి కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్)ను వెంటనే సరఫరా చేయాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శశికళ, ఆర్‌ఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డిక్షనరీల పంపిణీ

ఆత్మకూరు (ఎస్) : ఇటీవల గురుకుల పాఠశాలకు ఎంపికైన మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు చెందిన 18 మంది విద్యార్థులకు రిటైర్డ్ ఉపాధ్యాయుడు బత్తుల దామోదర్ రెడ్డి మంగళవారం డిక్షనరీలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రకాష్, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, సంతోష్ కుమార్, వనజ, ప్రభాకర్, యాదగిరి పాల్గొన్నారు.

వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి

నాగారం : విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని నాగారం ప్రాథమిక హెచ్‌ఎం వర్దెల్లి మల్లయ్య అన్నారు. మంగళవారం ప్రాథమిక పాఠశాలలో చివరి పనిదినం సందర్భంగా బాల సభ, తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు సృజనాత్మక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులను ప్రదానం చేసి, ప్రగతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటమల్లు, వీరేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

కాంటాలు ఆలస్యం.. రైతుల నిరీక్షణ

- లారీలు రాక ఎగుమతుల్లో జాప్యం
- వాతావరణంలో మార్పులతో భయాందోళనలో అన్నదాతలు



తిరుమలగిరిలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు

తిరుమలగిరి : ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను అమ్ముకోవాలంటే అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు రైతులు వరి ధాన్యాన్ని భారీగా తీసుకొస్తున్నారు. అయితే రోజులు గడిచినా కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు కాకపోవడం, కాంటాలైన లారీలు రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఆరు కేంద్రాలు..

తిరుమలగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో తిరుమలగిరి, నాగారం మండలాల పరిధిలో 6 కొనుగోలు కేంద్రాలను ఈ నెల 7వ తేదీన ప్రారంభించారు. ఈ కొనుగోలు కేంద్రాలలో 2 లక్షల బస్తాల ధాన్యం వరకు నిల్వ ఉంది. ఈ కేంద్రాలలో నామ మాత్రంగానే తూకాలవుతున్నాయి. తూకాలైన ధాన్యం బస్తాలను మిల్లులకు ఎగుమతి చేయడానికి లారీలు సరిగా రావడం లేదు. ప్రస్తుతం ఫణిగిరి కొనుగోలు కేంద్రంలో 4485 బస్తాలు, ఈటూరులో 595, తిరుమలగిరిలో 1300, బండ్లపల్లిలో 1436, వెలిశాలలో 790, తాటిపాములలో 921 బస్తాలు కేంద్రాలలో ఉన్నాయి. వాతావరణ పరిస్థితుల్లో మార్పు రావడంతో వర్షాలు వస్తాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు రోజుల కొద్ది కొనుగోలు కేంద్రాలలో ధాన్యం ఉండటంతో రాశులపై కప్పాల్సిన పట్టాలకు ఒక్కొక్క దానికి రూ.25 ఖర్చు చేయాల్సి వస్తోంది. అలాగే కొనుగోలు కేంద్రాల వద్ద ప్రతి రోజు ఒక వ్యక్తి ఉండాల్సి రావడంతో రూ.500 వరకు ఖర్చవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలలో వేగంగా కాంటాలు వేసి ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించాలని రైతులు కోరుతున్నారు.

లారీల కోసం ఎదురుచూస్తున్నాం



కొనుగోలు కేంద్రానికి పది రోజుల క్రితం ధాన్యం తీసుకొచ్చాను. తేమ శాతం తక్కువగా రావడంతో కాంటాలు వేశారు. 352 బస్తాల తూకం వచ్చింది. కానీ లారీలు రాకపోవడంతో బస్తాలు మిల్లులకు పోలేదు. దీంతో రోజూ బస్తాల కావలి ఉండాల్సి వస్తోంది.

– గుగులోతు మత్రు, ఈదులపర్రె తండా

పది రోజులు దాటింది



300 బస్తాల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాను. తేమ శాతం 17 లోపు వచ్చింది. కాంటాలు ఆలస్యం కావడం, బస్తాలు ఎగుమతి కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. వాతావరణంలో మార్పులతో భయాందోళన చెందుతున్నాం.

– గుగులోతు భోజ్యా, తిరుమలగిరి

నల్లాలకు మోటార్లు బిగిస్తే చర్యలు తప్పవు

సూర్యాపేట : సూర్యాపేట పట్టణంలో ఇంటి నల్లా కనెక్షన్‌లకు నేరుగా మోటార్లు బిగిస్తే క్రిమినల్ కేసు నమోదు చేయడంతోపాటు రూ.10వేల జరిమానా విధించనున్నట్లు మున్సిపల్ ఏఈ వరుణ్ హెచ్చరించారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ ఆదేశాల మేరకు నీటి సరఫరా ఎలక్ట్రికల్ సిబ్బందితో కలిసి పట్టణంలోని వివిధ వార్డుల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇంటి నల్లా కనెక్షన్‌లకు నేరుగా మోటార్లను పెట్టి నీటిని వాడుకుంటున్న గృహాల్లో 16 మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టణ గృహ యజమానులు తమ ఇళ్లలో నల్లా కనెక్షన్‌కు మోటార్లు పెట్టినట్లయితే క్రిమినల్ కేసు నమోదు చేసి, జరిమానా విధిస్తామని తెలిపారు.



మున్సిపల్ సిబ్బంది స్వాధీనం చేసుకున్న మోటార్లు

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత

తిరుమలగిరి : వేసవి కాలంలో గ్రామాల్లో తాగు నీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత అధికారులను ఆదేశించారు. మంగళవారం తిరుమలగిరి మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీసుకొచ్చిన ధాన్యానికి మద్దతు ధర వచ్చే విధంగా చూడాలని అన్నారు. కాంటాలు ఆలస్యం కాకుండా, రైతులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని ఆదేశించారు. సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ లాజర్, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



తిరుమలగిరి మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ స్నేహలత

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు బుద్ధి చెప్పాలి



మద్దిరాలలో మాట్లాడుతున్న సీపీఎం భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి జహంగీర్

మద్దిరాల : మతోన్మాద బీజేపీ, అవినీతి కాంగ్రెస్ పార్టీలకు పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతోపాటు జి.కొత్తపల్లి, గోరెంట్ల గ్రామాల్లో ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యల పరి ష్కారం కోసం సీపీఎంను గెలిపించాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముల్కలపల్లి రాములు, కొలిశెట్టి యాదగిరిరావు, కోటగోపి, వెంకటేశ్వరరావు, మట్టిపెల్లి సైదులు, పులుసు సత్యం పాల్గొన్నారు.

అర్వపల్లి : పార్లమెంట్ ఎన్నికల్లో సీపీఎంను గెలిపించాలని భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్ కోరారు. మంగళవారం జాజిరెడ్డిగూడెంలో ప్రచారం నిర్వహించిన అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడారు. తాను గత 35 ఏళ్లుగా కమ్యూనిస్టు పార్టీలో పనిచేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్నానని చెప్పారు. భువనగిరి గడ్డ కమ్యూనిస్టుల అడ్డా అని అన్నారు. ఈ గడ్డపై ఎర్రజెండా ఎగరాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, శిగ వెంకన్న, కొమ్ము విజయ్‌కుమార్, శిగ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వనాల్లో పచ్చదనానికి చర్యలు



అర్వపల్లిలోని పల్లె ప్రకృతి వనంలో చెత్తను తొలగిస్తున్న గ్రామ పంచాయతీ కార్మికుడు

సాక్షి ఎఫెక్ట్..

అర్వపల్లి : పల్లెలు పచ్చదనంతో ఉండటానికి ప్రతి గ్రామంలో ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. అయితే ఈ ప్రకృతి వనాలు ఎండలకు మాడిపోతున్నాయి. నీటి కొరతతో మొక్కలు ఎండిపోయి అధ్వానంగా మారుతున్నాయి. అయితే ఈ విషయమై ప్రకృతి వనాల్లో కరువైన పచ్చదనం శీర్షికన కథనాన్ని సాక్షిలో ప్రచురించగా అధికారులు స్పందించారు. జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా అన్ని ప్రకృతి వనాల్లో మొక్కలకు నీళ్లు పెడుతున్నారు. కంప, పిచ్చిచెట్లు తొలగించి శుభ్రం చేసే పనులు చేపడుతున్నారు. మొక్కలు ఎండిపోకుండా పచ్చదనంతో కళకళలాడేలా చూడాలని ఎంపీడీఓ సందీప్‌కుమార్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

శ్రీసుదర్శన సహిత లక్ష్మీనర్సింహస్వామి హోమం

చివ్వెంల : ఉండ్రుగొండ గ్రామ శివారులోని గిరిదుర్గంలో వెలిసిన శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో క్రోధినామ సంవత్సర చైత్రమాస పౌర్ణమి సందర్భంగా మంగళవారం శ్రీ సుదర్శన సహిత లక్ష్మీనర్సింహస్వామి హోమం నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్ఛరణతో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చకిలం క్రిష్ణకుమార్, బంధకవి క్రిష్ణ మోహన్, మధు సూదన్‌రావు పాల్గొన్నారు.



హోమం పూజలో పాల్గొన్న భక్తులు

పలు గ్రామాల్లో పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న ప్రత్యేక బలగాలు

నూతనకల్ : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలందరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్‌ఐ జె.సైదులు ఓటర్లను కోరారు. మంగళవారం మండల పరిధిలోని తాళ్లసింగారం, చిల్పకుంట్ల గ్రామాల్లో పారామిలటరీ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఓటర్లు రాజకీయ పార్టీల నాయకుల ప్రలోభాలకు, బెదిరింపులకు గురికాకుండా స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు. గ్రామాల్లో ఘర్షణ వాతావరణం నెలకొల్పే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ కోమటిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చదనంతో కనువిందుగా..



పచ్చదనంతో కళ కళలాడుతున్న అర్వపల్లిలోని పంచాయతీ కార్యాలయం



మొక్కలకు నీళ్లు పోస్తున్న కార్మికురాలు

అర్వపల్లి : అర్వపల్లిలోని గ్రామ పంచాయతీ కార్యాలయం పచ్చదనంతో కళ కళలాడుతోంది. ఇక్కడ కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీకి మొదటి విడతలోనే సొంత భవన నిర్మాణం చేపట్టారు. దీనికి తోడు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని గ్రీనరీగా మార్చారు. పార్కులను మైమరిపించేలా ఇక్కడి పంచాయతీ కార్యాలయ ఆవరణలో వివిధ రకాల పూలు, నీడనిచ్చే మొక్కలను పెంచుతున్నారు. అలాగే కార్యాలయం ఎదుట, చుట్టూ పచ్చని గడ్డిని నాటి పెంచుతున్నారు. ఉదయం, సాయంత్రం నీటిని పోస్తూ మొక్కలను సంరక్షిస్తున్నారు. ఇక్కడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో పచ్చదనంతో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడింది.

ఆలయంలో అన్నదానం

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గల అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి ఆకు పూజ, పంచామృతాభిషేకం నిర్వహించారు. స్వామి వారిని తీరొక్క పూలతో అలంకరించారు. ఏలూరి కార్తీక్‌సాయి జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాతలు మాధవి, రాజశేఖర్, రాజారావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు జూకురి అంజయ్య, తిరపతయ్య, హనుమంతరావు, కృష్ణమూర్తి, సత్యం పాల్గొన్నారు.

అదనపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయరూ..

- కొమ్మాలలోని కొనుగోలు కేంద్రానికి భారీగా చేరుతున్న ధాన్యం
- పంటను అమ్ముకునేందుకు రోజుల తరబడి అన్నదాతల నిరీక్షణ
- అధికంగా ధాన్యం దిగుబడి, ఒకటే కేంద్రం ఉండటంతో ఇబ్బందులు

అర్వపల్లి : ఆ గ్రామంలో ధాన్యం దిగుబడి అధికంగా ఉంటుంది. ప్రతి సీజన్‌లో ఇక్కడ ఏర్పాటు చేసే ఒకే ధాన్యం కొనుగోలు కేంద్రంతో కొనుగోళ్లు త్వరితగతిన జరగక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గత యాసంగి సీజన్‌లో జూన్ నెలాఖరు వరకు ధాన్యం కొనుగోళ్లు సాగాయి. దీంతో రైతులు వర్షాలతో ధాన్యం తడిసి నష్టపోయారు. అదే జాజిరెడ్డిగూడెం మండలంలోని కొమ్మాల గ్రామ సెర్ప్ ధాన్యం కొనుగోలు కేంద్రం. ఈసారి కేంద్రం ఇప్పటికే ధాన్యంతో పూర్తిగా నిండిపోయింది. ఈ కేంద్రాన్ని గ్రామంలోని కందులబండ వద్ద ఏర్పాటు చేశారు. ఈ స్థలం చాలక గ్రామంలోని కంఠమహేశ్వరస్వామి దేవాలయం వద్ద, తుమ్మల బావి వద్ద రెండు చోట్ల వేర్వేరుగా ధాన్యంను అమ్మడానికి రైతులు రాశులు పోసి ఉంచారు.



కొమ్మాలలోని కేంద్రంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

ధాన్యంతో నిండిపోయిన ఖాళీ స్థలాలు..

కొమ్మాలలో గత యాసంగి సీజన్ నందు 60 వేల బస్తాలకు పైగానే పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యాన్ని కొనుగోలు చేశారు. సుమారు 85 లారీల ధాన్యాన్ని గ్రామం నుంచి మిల్లుకు ఎగుమతి చేశారు. అయితే గ్రామంలో ఉన్న రైతులలో సుమారు 10 మందికి పైగా రైతులు 800 నుంచి 1000 బస్తాలకు పైగా ధాన్యాన్ని విక్రయిస్తారు. మిగిలిన రైతులకు కూడా ధాన్యం దిగుబడి బాగానే ఉంటుంది. ఈ సీజన్‌లో గ్రామంలో సెర్ప్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఒక్క కేంద్రమే కావడంతో కొనుగోళ్లు, ఎగుమతులలో జాప్యం జరుగుతోంది. ఈసారి ఇప్పటికే సుమారు 40 వేల బస్తాల వరకు ధాన్యాన్ని ఖాళీ స్థలాలలో అమ్మడానికి రాశులు పోసి ఉంచారు. అయితే ఇప్పటివరకు 7,300 క్వింటాల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారు. మిగిలిన ధాన్యం మొత్తం కొనుగోలు జరగాల్సి ఉంది. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన హైకోర్టు న్యాయవాది, రైతు దరూరి యోగానందచారి శనివారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో వెంటనే అదనపు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరగా సానుకూలంగా స్పందించి ఎమ్మెల్యే జిల్లా అధికారులతో మాట్లాడారు. కాగా వాతావరణం మారుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అకాల వర్షాలు పడితే తీవ్రంగా నష్టపోతామని వెంటనే అదనపు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

వంద బస్తాల ధాన్యం తీసుకొచ్చాను



కొమ్మాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో వంద బస్తాల ధాన్యాన్ని పోసి ఉంచాను. ఈ ధాన్యం పోసి 10 రోజులు కావస్తుంది. ఒకే ధాన్యం కొనుగోలు కేంద్రం కావడంతో పూర్తిగా నిండిపోవడంతో ఖాళీ స్థలాలలో ధాన్యం పోయాల్సి వస్తుంది.

- కుంటిగొర్ల శ్రీనివాస్, రైతు, కొమ్మాల

అదనపు కేంద్రాన్ని ప్రారంభించాలి



ఇతర గ్రామాల కన్నా మా గ్రామంలో ధాన్యం ఎక్కువగా పండటం, ఒకే కొనుగోలు కేంద్రం ఉండటంతో ప్రతిసారి ఇబ్బందులు అవుతున్నాయి. అదనపు కేంద్రం ఏర్పాటు చేస్తేనే కొనుగోళ్లు తొందరగా కానున్నాయి. లారీలు కూడా తక్కువగా వస్తుండటంతో ఎక్కువ ధాన్యాన్ని కొనలేకపోతున్నారు.

- బయ్య గంగయ్య, రైతు, కొమ్మాల

కేసీఆర్ బస్సుయాత్రను జయప్రదం చేయాలి



అర్వపల్లిలో సమావేశమైన బీఆర్‌ఎస్ నాయకులు



మద్దిరాలలో మాట్లాడుతున్న ఎస్‌ఏ.రజాక్



తుంగతుర్తి : మానాపురంలో..

అర్వపల్లి : సూర్యాపేటలో బుధవారం సాయంత్రం జరిగే బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బస్సుయాత్రను బీఆర్‌ఎస్ శ్రేణులు విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్ కోరారు. మంగళవారం అర్వపల్లిలో జరిగిన బీఆర్‌ఎస్ మండల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఎంపీ ఎన్నికల ప్రచారం సందర్భంగా జరిగే రోడ్ షోకు మండలం నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు బొడ్డు రామలింగయ్యయాదవ్, బైరబోయిన రామలింగయ్య, పందిరి యుగంధర్, గోసుల విజయ్, దుబ్బాక ఎల్లంరాజు, కనుకు శ్రీనివాస్, ఎడ్ల సైదులు, జీడి సుందర్, ప్రభు, రవీందర్, కిరణ్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : సూర్యాపేటలో బుధవారం జరిగే మాజీ సీఎం కేసీఆర్ రోడ్ షోను జయప్రదం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య కోరారు. మంగళవారం మానాపురం గ్రామంలో జరిగిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మంగ్లీ దశరథ, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : సూర్యాపేటలో బుధవారం జరిగే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రోడ్డు షోను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎస్‌ఏ.రజాక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, బద్దం సంజీవరెడ్డి, జిలకర్ర చంద్రమౌళి, వడ్డాణం మధుసూదన్, కొలగాని వెంకన్న, నాగెల్లి శ్రవణ్‌కుమార్, తిరుమలరావు, ఎంపీటీసీ అవిలయ్య, రాజేంద్రప్రసాద్, పాతూరి లింగారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి

మద్దిరాల : మద్దిరాల మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు పోతరాజు అవిలయ్య మండల పరిధిలోని రెడ్డిగూడెం శివారులోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో మంగళవారం మృతిచెందినట్లు ఏఎస్‌ఐ నాగయ్య తెలిపారు. పోలీసులు వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన పోతరాజు అవిలయ్య(30) పుట్టు దివ్యాంగుడు. అతడు సోమవారం ఇంటి నుంచి తప్పిపోయినట్లు మృతుడి తండ్రి లింగయ్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మంగళవారం మండల పరిధిలోని రెడ్డిగూడెం శివారులోని విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో ఓ మృతదేహం పొలంలో కనిపించినట్లు స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకొని ఆ మృతదేహం అవిలయ్యదిగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

తెలంగాణలో బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

నడిగూడెం : తెలంగాణలో బీజేపీ గెలిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ రాష్ట్ర నాయకురాలు, ఎన్నికల మండల ఇన్‌చార్జ్ బండారు కవిత అన్నారు. మంగళవారం మండలంలోని శ్రీరంగాపురంలో నల్లగొండ పార్లమెంట్ నియోజకర్గ బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిని గెలిపించాలని కోరుతూ పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దున్నా సతీష్, నాయకులు పాల్గొన్నారు.

పశుగ్రాసం కొరత

- వేసవి వరిపొలాలు ఎండిపోవడంతో రైతులకు ఇబ్బందులు

ఆత్మకూరు (ఎస్) : ఆత్మకూరు మండల వ్యాప్తంగా పశుగ్రాసానికి కొరత ఏర్పడింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది పశుగ్రాసానికి రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధానంగా ఎస్సారెస్పీ ఆయకట్టులో సాగుచేసిన వరి పొలాలు ఎండిపోవడం రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది. గత నాలుగైదు ఏళ్లుగా రెండు పంటలకు ఈ ఆయకట్టులో నీళ్లు అంది పశుగ్రాసానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంది. దీంతో రైతులు పశుగ్రాసం ఎక్కువై నిప్పులు పెట్టిన సంఘటనలు ఉన్నాయి. అయితే ఈ యసంగిలోనూ వరిపొలాలు బాగానే పండుతాయన్న ఆలోచనతో వానాకాలం పశుగ్రాసాన్ని రైతులు పెద్దగా పట్టించుకోలేదు. తదనంతరం వర్షాభావ పరిస్థితులతో ఆయకట్టుకు నీరందకపోవడం, చెరువులు, కుంటల్లోనూ నీటి మట్టాలు తగ్గి బోరు బావులు అంతంత మాత్రమే పోయడంతో వాటి పరిధిలోని వరి పొలాలు అక్కడక్కడ ఎండిపోయాయి. గతంలో ఇక్కడ పశుగ్రాసం దొరకని పరిస్థితుల్లో సాగర్ ఆయకట్టుకు వెళ్లి రైతులు పశుగ్రాసం కొనుగోలు చేసి తెచ్చుకునేవారు. కానీ ప్రస్తుతం సాగర్ ఆయకట్టులోనూ వరి పొలాలు సాగు చేయకపోవడంతో కష్టాలు మరింత పెరిగాయి. పశువులు ఉన్న రైతులు ఎక్కడ గడ్డి దొరికినా వెంటనే కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు.



ఆత్మకూరులో ట్రాక్టర్‌లో గడ్డిని తరలిస్తున్న రైతులు

ధ్వజస్తంభానికి జలాభిషేకం

చిలుకూరు : చిలుకూరు మండలంలోని నారాయణపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన కనకదుర్గమ్మ దేవాలయంలో గణపతి, సుబ్రహ్మణ్యస్వామి నవగ్రహ, జీవ ధ్వజస్తంభ శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం మహిళలు జలబిందెలతో గ్రామంలో ప్రదర్శనగా ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం ధ్వజస్తంభానికి జలాభిషేకం చేశారు. బుధవారం యంత్ర స్థాపన, కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఉన్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.